


గొప్పవాడు అనబడే వాడెంత గొప్పవాడో, గొప్పవాడి పక్కవాడుకూడా అంత గొప్పవాడే. ఎవరైనా కాదనివాదుకువొస్తే అసలుగొప్పవాడికంటే గొప్పవాడి పక్కవాడే గొప్పవాడని బల్లగుద్దిచెప్పి తప్పక ఒప్పించగలను. పక్కవాడు లేని గొప్పవాడు లేడు. ఈ మహాప్రపంచంలో ఏ మూలైనా అలాంటివాడున్నా ఎవరూ ఒప్పుకునేదిలేదు. అథవా ఒప్పుకున్నా ఆ పురుషుడు సజీవంగా లేకపోతేనే. నీడ లేనిమనిషిలా, పక్కవాడులేని గొప్పవాడంటూ ఎవడూ ఉండబోడని మళ్ళీ మనవి చేస్తున్నాను. ఈ ప్రకటన కొంత మందికి ఆశ్చర్యం కలిగించవచ్చు. కుంచె లేని చిత్రకారుణ్ణి ఊహించుకోండి; కలం లేని కథకుణ్ణి ఊహించుకోండి. అలాగే పక్కవాడు లేని గొప్పవాడు. ప్రతిభని ప్రచారంచేసే సాధనం లేకపోతే ప్రతిభ ఎలా రాణిస్తుంది? గొప్పవాడి గొప్పతనం పక్కవాడికి తెలిసినంతగా ఎవరికీ తెలియదు; చివరికి గొప్పవాడికి కూడా. అవునా, కాన్యూట్ రాజుగారి కథ జ్ఞాపకం తెచ్చుకోండి. కావాలంటే నవీనహిందూదేశ చరిత్రనుంచికూడా ఉదాహరణ లివ్వగలను. ఒక జిల్లాలో ఒక గొప్పవాడున్నాడు—పేరెందుకు లెండి—నిజంగా గొప్పవాడే. అవునా, అటువంటివాడు జిల్లా బోర్డు ఎన్నికలకి నుంచోవచ్చునా; ఊహుం—నుంచోనంటాడే! "ఇంతమందిలో నా గొప్పతనమేమిటి, నన్నెవ రెన్నుకుంటారు? నేను నిలబడను," అంటాడు. పక్కవాళ్లు- గొప్పవాడి గొప్పతనాన్నిబట్టి పక్కవాళ్ల సంఖ్యాబలం హెచ్చుతూ ఉంటుంది—ఉన్నారు కాబట్టి, "నువ్వు నిలబడవయ్యా, చాలు! నీ గొప్పతనం నీకు తెలీదుకాని నువ్వు నడుంకట్టావంటే అపజయమనేది లేదనుకో. అసలు నువ్వు ఎన్నికలకి నిలబడితే ఓట్లన్నీ వానకురిసినట్టు కురవ్వా నీ పెట్టెలో!" అని ఆయన గొప్పతనం ఆయనకు తెలియచేసి ఎన్నికలకి నుంచోపెట్టారు. ఓ పదివేలు పోతేనేంగాక, తకీమని ఆయన జిల్లాబోర్డు ప్రెసిడెంటుగా ఎన్నుకోబడ్డాడు. చూశారా మరి, ఇలాంటి ఉదాహరణలు లక్షోపలక్షలు.

గొప్పవాడి పక్కవాడు హిస్ మాస్టర్స్ వాయ్స్; అంతేకాదు ఉన్ కే, తన్, మన్, ధన్ ఔర్ ప్రాణ్. ఖుర్బాను చెయ్యగలను.

ఏ గొప్పవాడూ తనని గురించి తాను గొప్పగా చెప్పుకోడు. చెప్పుకోటం ఇష్టం ఉండదనికాదు. అలా చెప్పుకుంటే ఏటవాలు బల్ల మీదనుంచి జారినట్టుగా పీఠంమీద నుంచి జారి పోవలసి వస్తుంది. అంచేత పక్కవాడు గొప్పవాడి తరఫున వకాల్తా పుచ్చుకుని, గొప్పవాడి సొంత స్వరం కంటె పదిరెట్లు ఉచ్చైస్స్వరంతో అతని కంఠం కొరత తీరుస్తాడు. "గొప్పవాడికి సొంతడబ్బు గిట్టదు. అంటే తన డబ్బు తనే వాయించుకునేటంత స్వార్థపరుడు కాడు. వాయించే వాళ్లుంటే తన డబ్బుని వాళ్లకి పప్పు చెప్పగలవితరణశాలి అతను." అని చెప్పకనే చెబుతూ గొప్పవాడి కంఠానికి ప్రాతినిధ్యం వహిస్తాడు.

అసలు కొన్ని సమయాల్లో పక్కవాడే గొప్పవాడి "వాయిస్." గొప్పవాడికి ఎన్నో

పనులుంటాయి. ప్రతి పనికీ స్వయంగా హాజరు కావటం కష్టం. చిన వాళ్ళకి స్కాలర్ షిప్పులూ, కొద్దిగా దూరపు బంధువులకీ, స్నేహితులకీ, స్నేహితుల స్నేహితులకీ, వాళ్ళ బంధువులకీ, స్వజాతి వాళ్ళకీ, స్వస్థలవాసులకీ నెరవేర్చాలిసిన సిఫారసులు లాంటివి ఉంటాయనుకోండి. ఇవన్నీ పక్కవాడు చూసుకుంటాడు. ఎవరికో సిఫారసు చేయాలో ఆ ఉద్యోగి దగ్గరికి పక్కవాడు సిఫారసు చేయబడే వాళ్ళతో సహా వెళ్ళి, "అయ్యా, నేను ఫలానా గొప్పవాడి దగ్గర్నుంచి వొచ్చాను. ఈ పనేదో కాస్త చేసిపెట్టండి" అంటాడు. ఆ ఉద్యోగి కాస్త తటపటాయించాడా, పక్కవాడు ఆగ్రహావేశ పరవశుడై, "ఏమండోయ్, గొప్పవాడు చెప్పలేదనుకుంటున్నారేమో, గొప్పవాడి మాటా, నా మాటా ఒక్కటే. ఆ మాటకొస్తే గొప్పవాడే నేను, నేనే గొప్పవాడు. నేను చెప్పిన ప్రతి అక్షరం గొప్పవాడు చెప్పినట్టే, గమనించారా? తర్వాత మీ ఇష్టం" అని బెదిరించి కోపంతో వెళ్ళిపోతున్నట్టు నటిస్తాడు. ఉద్యోగంమీద ఆశ వున్న ఉద్యోగి వెంటనే పక్కవాడి కోపోపశమనం చేయాలిసిందే.

"[illegible] మాస్టర్స్ వాయిస్" అనే బిరుదప్రదానం చేస్తే వీళ్ళలో ఏ ఒక్కరికీ కష్టంగా ఉండదని నా నమ్మకం.

ఈ రోజుల్లో ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట విందు జరుగుతూనే ఉంటుంది — అకారణంగానే. (పేదవాళ్ళ కనుకనేం! ఉన్నవాళ్ళకే. లేనివాళ్ళకి విందులు చేస్తే ఏమొస్తుంది?) [illegible] విందు చేయటం ప్రధానంగాని అందుకు కారణం ఉండటం ప్రధానం కాదు. గొప్పవాడికి రాని ఆహ్వానమంటూ ఉండదుగా. ప్రతి విందుకీ వెళ్ళటం గొప్పవాడికి అనవసర శ్రమ, అది కాక శరీరం మొరాయించటం కూడా కద్దు. ఇలాంటి సమయాల్లో పక్కవాడు గొప్పవాణ్ణి కనికరిస్తాడు. "గొప్పవాడికి తీరిక లేకపోయిందండీ. నన్నే తననిగా భావించుకోమన్నారు మమ్మల్ని" అని విందు తలపెట్టినాయనతో ముచ్చటగా అనేసి పక్కవాడు గొప్పవాడి శరీరానికి ప్రాతినిధ్యం వహిస్తాడు. ఇందుకు, విందుకు పిలిచిన పెద్దమనిషి నిరభ్యంతరంగా ఒప్పుకుంటాడు. ఎందుకొప్పుకోడు? పక్కవాడి ప్రభావం ఆయనకి తెలియదు గనకనా? పని గనక చేస్తే సరి, ఎవరయితే నేం?

గొప్పవాడు అతిగా మాట్లాడడు. ఈ నియమం అతను విధిగా అమల్లో పెడతాడు. ఎందుకంటారా? అతిగా మాట్లాడటం అనేక విధాల అరిష్టదాయకం. మనిషి శరీరంలో మాట్లాడటానికి అమర్చబడ్డ అవయవాలు బహు ప్రమాదకరమైనవి. వాటిని అదుపులో పెట్టుకోకపోతే అవి భస్మాసుర హస్తాల్లా పరిణమించగలవు. అసలు గొప్పవాడికి అతిగా మాట్లాడటానికి తీరిక, ఓపిక కూడా ఉండవు. అతని నోటినుంచి వొచ్చే ప్రతి మాటా ఎంతో విలువైంది. ఆ మాటల్లోని గొప్పతనం, వాటిలోని అంతరార్థం, భావగాంభీర్యం ప్రతివాడికీ అర్థమయేలా విప్పి చెప్పటం వాటిని వ్యాఖ్యానించటం గొప్పవాడి పక్కవాడి పని. పక్కవాడు ఎంత గొప్పవాడైతే గొప్పవాడి మాటలు అంత గొప్పగా మనకి అర్థమవుతాయి. పక్కవాడికి గొప్పవాడి మనస్సు కరతలామలకం. అందుచేత గొప్పవాడి మాటల వెనకాల ఉండే గొప్పతనాన్ని మనకి విశదీకరించటంలో పక్కవాడి సహాయం మనకి అత్యవసరం. ఒక చిన్న సంఘటన జ్ఞాపకం వస్తోంది.

ఓ సభలో ఉపన్యసిస్తూ ఒకానొక గొప్పవాడు ఇలా అన్నాడు: "నా అమూల్యమైన అభిప్రాయంలో..." "కొయ్య్" అని వెనకాల కూర్చున్న ఓ కొంటె కుర్రాడు హెచ్చుస్థాయిలో అన్నాడు. "షేమ్" అని మరో విద్యార్థి అందుకున్నాడు. సభలో కలకలం బయలుదేరింది. గొప్పవాడి రుమాలు చెమటని అరికట్టటానికి ప్రయత్నించి దానికి లొంగిపోయింది. ఇంతలో గొప్పవాడి పక్కవాడు లేచి మహాగంభీర స్వరంతో ఇలా అన్నాడు: "ఓ సభాసదులారా! మీరంతా మన గొప్పవాణ్ణి అర్థం చేసుకోలేక అల్లరి ప్రారంభిస్తున్నారు. 'అమూల్యమైన అభిప్రాయం' అనే మాటల్ని మీరు అపార్థం చేసుకున్నారని నాకు తెలుస్తోంది. 'అమూల్యమైన' అనటంలో గొప్పవాడి అభిప్రాయం మీకు విశదపరుస్తున్నాను. అమూల్యము అంటే మూల్యం లేనిది. అంటే విలువ లేనిది. 'నా అభిప్రాయానికి విలువ లేదు' అని అతను వినయంగా మనవి చేశాడు. ఇది

అతని నిరాడంబరత్వానికీ, వినయ విధేయతలకీ తార్కాణం. 'అమూల్యమైన' అనటంలో గొప్పవాడు ఇంకో అభిప్రాయాన్ని కూడా వ్యక్తపరిచాడు. మూల్యం లేకుండా అంటే ఉచితంగా నా అభిప్రాయాన్ని మీరు చెబుతున్నారు అని. ఇది అతని పరోపకార పారీణతకి అద్భుతమైన నిదర్శనం ఇది మీరు గ్రహించకండా, గొప్పవాడిని ప్రశంసించక, అభిశంసించటం మన మూఢత్వాన్ని తెలియచేస్తుంది గొప్పవాడిని హేళన చెయ్యటానికి సాహసించేటందుకు మనం ముందు వెనుకలు బాగా ఆలోచించాలి." సభలో వాళ్లంతా తెల్ల మొహాలు వేశారు. గొప్పవాడు చిరునవ్వుతో పక్కవాడివైపు కృతజ్ఞతతో చూశాడు. పక్కవాడికి గొప్పవాడి ఊహాలు బాగా తెలుస్తాయి కనుక అతని తరఫున వకాల్తా వెంటనే పుచ్చుకోగలిగాడు. ఆక్షణంలో పక్కవాడు ఉండబట్టి సరిపోయింది గాని లేకపోతే గొప్పవాడికి ఎంత పరాభవం జరిగేది! గొప్పవాడు స్వతంత్రంగా ఇలా సమాధానం చెప్పలేడా ఏమిటి? అని మీరు అనొచ్చు. గొప్పవాడికి మనసులో ఉంటే ఉందిగాక, వెంటనే అది నాలుకమీదికి రావొద్దూ? అదిగాక గాభరాలో అసలు తన ఉద్దేశాలు మర్చిపోకూడదని ఎక్కడుంది?

గొప్పవాడి జుట్టెప్పుడూ పక్కవాడి చేతిలోనే ఉంటుంది. పక్కవాడిని కాస్త నిర్లక్ష్యంగా చూడటం సాగించాడంటే గొప్పవాడు చప్పున తలకిందులు కావలసిందే. పక్కవాడు తన బడేవాడు గొప్ప సమర్థుడని ముందే చెప్పాను. నిర్లక్ష్యంగా చూడబడ్డ పక్కవాడు గొప్పవాడి పతనం ఒక్క చిరునవ్వుతో సాధించ గలడు. ఓ నలుగురు పెద్దమనుష్యులం చేరి ఫలానా గొప్పవాణ్ణి జరగబోయే మీటింగుకి అధ్యక్షుణ్ణిగా ఎన్నుకుందామని నిశ్చయించుకుంటారనుకోండి. పక్కవాడికీ సంగతి ముందే తెలుస్తుంది. ఎలా అంటారా? పక్కవాడి ప్రతిభ అటువంటిది. ఇంతకంటె నేనేం చెప్పగలను? ఆ పెద్ద మనుష్యుల దగ్గిరికి వెళ్ళి పక్కవాడు ఏమీ తెలియ



జెమినీవారి తమిళచిత్రం "అపూర్వ సహోదరులు"లో ఒక సన్నివేశం.

నట్టుగా "మీటింగుకి అధ్యక్షు డెవరు?" అని అడుగుతాడు. సమాధానం విని ఒక చిన్న నవ్వు ఒలికిస్తాడు. వాళ్లు వింతగా చూస్తారు. "పక్క వాడా!" అని పక్కవాడు నవ్వుకుంటాడు. "ఏం?" అని ఆ పెద్దమనుష్యులు అడగటం సహజమే. పక్కవాడు యిచ్చే సమాధానం నవ్వే. అది చాలు. అసలు నవ్వు చేసే పని ఈ ప్రపంచంలో మరోటి చెయ్యలేదు. నవ్వు మాహాత్మ్యం తెలియని దెవరికి? ఒకవేళ నవ్వుతో పని అంత సానుకూలం కాకపోయినా పక్క వాడికి విజయం సాధించటానికి మిగతా సాధనలు ఉండనే ఉన్నాయి.

గొప్పవాడు కాస్త లోకువగా ఉంటే అతని రాజ్యమంతా పక్కవాడే ఏలుతాడు. ఓ గొప్ప వాడు అధికారంలోకి వొచ్చాడనుకోండి. అతని పక్కవాడుకూడా అధికారంలోకి వొచ్చాడన్న మాటే. గొప్పవాడు కాస్త బద్ధకస్తుడైతే, లేక మొహమాటస్తుడైతే పక్కవాడి హవాకి ఎదురు లేదు. అతడి ప్రతిభ అప్రతిహతంగా వెలిగిపోతుంది. గొప్పవాడి అనుగ్రహం పొందాలంటే ముందు పక్కవాడి సమ్మతి పొందాలి. పక్కవాడికి ఆగ్రహం కలిగితే అభ్యర్థులకి శనిగ్రహం పట్టినట్టే భావించుకోవొచ్చు. పక్కవాడి కొన్ని చర్యల వల్ల గొప్పవాడి అధికారం పోవటం సంభవిస్తే అది గొప్పవాడి దురదృష్టం. కొందరి కుట్రలవల్ల అలాజరిగిందని పక్కవాడు తప్పుకగ్రహించగలడు.

పక్కవాడు గొప్పవాడికి తరగని ధనం లాంటి వాడని పదితే అతిశయోక్తి ఎంత మాత్రం కాదు. ధనంసాధించలేనిపనులు కూడా పక్కవాడు సాధించగలడు. ఇంత చెప్పిన మీదటగొప్పవాడి ప్రాణం పక్కవాడేనని మీరీ పాటికి గ్రహించే ఉంటారు—ప్రాణమేమిటి, మానంకూడా.

గొప్పవాడికి ఇంతటి ప్రయోజన కారకుడయిన పక్కవాడిని తగురీతిగా ప్రశంసించటానికి మన తెలుగు భాషలో సరైన పదాలు దొరకటంలేదు. పాడని రేడియోలా, తవ్వని ఖనిజంలా, పాతిపెట్టిన ధనంలా పక్కవాడు లేని గొప్పవాడి గొప్పతనం నిరర్థకం, అది అడవి కాచిన వెన్నెల, పక్కవాయిద్యాలు లేని గాత్రం ఎంత గొప్పదైతేమటుకు ఏం రాణిస్తుంది?

గొప్పవా డనబడేవాడు ఎంత గొప్పవాడో గొప్పవాడి పక్కవాడుకూడా అంతగొప్పవాడేనని, లేక అంతకుమించిన గొప్పవాడేనని బుజువైంది. 'గొప్పవాడి పక్కవాడుకావటం మూలంగా గొప్పవాడైన ఆ పక్కవాడికి పక్క వాళ్లు ఉన్నట్టేనా'' అని తర్కం తెలిసిన కొందరు తమ సందేహం ప్రశ్నరూపంలో వెలిబుచ్చవచ్చు. ఆ, ఉన్నారు అన్న మాటే, పక్కవాడై గొప్పవాడైన ఆ పక్కవాడికి, వాడి పక్కవాడికీ, మళ్లీ ఆ పక్కవాడికీ—ఇలా. మరి లేకపోతే ప్రపంచంలో ఇంతమంది గొప్ప వాళ్ళు ఎలా ప్రచారంలోకి వొచ్చారనుకుంటు న్నారు! ఇంకో రహస్యం చెబుతున్నా వినండి. పక్కవాడంటూ ఉంటే ప్రతి వాడూ గొప్పవాడే. పక్కవాడు లేక పోబట్టి గాని—మనలో మాట నేను మాత్రం గొప్పవాణ్ణి కాదూ? ఆ మాట కొస్తే మీలో గొప్పవాడు కాని వాడెవడు? కాని మనందరికీ కనీసం తలో పక్కవాడూ లభిస్తేగాని మన గొప్పతనం ఎవడూ ఒప్పుకోడు.

అందుకని గొప్పవాడికి ఎన్ని సన్మానాలు చేస్తారో పక్కవాడికికూడా అన్ని సన్మానాలు, అంతకుమించిగానూ చెయ్యాలని నా వాదం. పక్క వాడి ప్రతిభ బహుముఖమని మనవిచేశాను. ఈ పక్కవాడే లేకపోతే గొప్పవాడికి పుట్టగతు లేవు. గొప్పవాడి పక్కవాడు పుత్ర, పౌత్ర, ఐశ్వర్యాభివృద్ధులతో [illegible] వర్ధిల్లుగాక

(ఓ గొప్పవాడి పక్కవాడి సన్మాన సభలో చదివిన ప్రసంగవ్యాసం.)